ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 04-10-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యను బలోపేతం చేస్తోందని కేంద్ర మంత్రి మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందన్నారు.

2. హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

3. రాష్ట్రంలో TDRల జారీలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.

4. రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**తెలంగాణ కేవీ-కిషన్ రెడ్డి**

గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విద్యను బలోపేతం చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రానికి కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసినట్లు సామాజిక మాద్యమ పోస్టులో పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జగిత్యాల జిల్లాలోని చెల్గల్, వనపర్తి జిల్లా నాగవరం శివారులో వీటిని ఏర్పాటు చేయబోతున్న విషయాన్ని తెలిపారు. వీటితో రాష్ట్రంలో మొత్తం కేంద్రీయ విద్యాలయాల సంఖ్య 35 నుంచి 39కి పెరగనుందని అన్నారు.

(డెస్క్)

**పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉదయం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. సుమారు 2 కోట్ల 16 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు , కమ్యూనిటీ హాళ్ల పునరుద్ధరణ పనులు , 53 లక్షల రూపాయలతో మంచినీటి , మురుగునీటి పైప్ లైన్ పనులు తక్షణమే ప్రారంభమవుతాయని తెలిపారు. స్థానికుల కోసం వాకింగ్ ట్రాక్ తో కూడిన పార్కును ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

(పీటీసీ, హైదరాబాద్)

**టీపీసీసీ-ఓట్ చోరీ**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓట్ చోరీ ఉద్యమానికి మద్దతు కూడగట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమాయత్తమైంది. ఓట్ చోరీ పై రాష్ట్రంలో అవగాహన కార్యక్రమాలు, సంతకాల సేకరణపై చర్చించేందుకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఈ సాయంత్రం జూమ్ సమావేశం నిర్వహించనుంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు . మంత్రులు, ప్రజాప్రతినిధులు, కార్పోరేషన్ చైర్మన్లు , టీపీసీసీ నేతలు సహా పార్టీ ముఖ్య నాయకులందరూ ఈ జూమ్ మీటింగ్ లో పాల్గొంటారు.

(పీఎన్)

**కేటీఆర్-టీడీఆర్**

రాష్ట్రంలో ట్రాన్స్ ఫరబుల్ డెవలప్ మెంట్స్ రైట్స్ - TDR జారీలో భారీ కుంభకోణం జరుగుతోందని, ఇది వేల కోట్ల రూపాయలకు చేరిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక

అధ్యక్షుడు తారక రామారావు ఆరోపిపంచారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. తాను ఈ విషయంపై ఆరు నెలల క్రితమే హెచ్చరించినా , ఇప్పుడు అది తీవ్ర రూపం దాల్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ కుంభకోణం రాష్ట్రంలోని ఓ ముఖ్యనేత అనుచరుడి కనుసన్నల్లోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కొత్త TDRల జారీని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి, కృత్రిమ కొరతను సృష్టించారని విమర్శించారు.

(డెస్క్)

**హైడ్రా కూల్చివేతలు**

హైదరాబాద్ లోని కొండాపూర్ లో ప్రభుత్వం స్థలంలో ఆక్రమ నిర్మాణాలను హైడ్రా ఈ రోజు కూల్చి వేసింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగ ర్ లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది ఈ ఉదయం తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. అనంతరం ఆ స్థలం చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలం విలువ దాదాపు 3 వేల 6 వందల కోట్లు ఉందని హైడ్రా పేర్కొంది. కూల్చివేతల సమాచారం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆందోళన చేపట్టారు.

(డెస్క్/పీటీసీ, హైదరాబాద్)

**SN -SP -జగిత్యాల సౌండ్ బైట్**

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ శక్తి పరివార్ పథకం జగిత్యాల జిల్లాలో పూర్తి స్థాయిలో అమలైంది. ఈ పథకం కింద జిల్లాలోని అన్ని ఆసుపత్రులతో పాటు 123 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ ఆకాశవాణితో తెలిపారు.

(సౌండ్ బైట్ ఉప వైద్యాధికారి శ్రీనివాస్)

(జగిత్యాల జిల్లా, పీటీసీ)

**గవర్నర్-గోశాల**

సికింద్రాబాద్ బొల్లారంలో డాక్టర్ గౌతమి ముని శాంతి విమలా కంటోన్మెంట్ గోశాల , పశు వైద్యశాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

**(పీఎస్)**

**యంగ్ ఇండియా అడ్మిషన్స్**

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఆసక్తిగల తల్లిదండ్రులు తమ పిల్లల అడ్మిషన్ల కోసం yipschool.in వెబ్ సైట్ లేదా 90591 96161 నంబర్ లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. 50 శాతం సీట్లు పోలీస్ సిబ్బంది పిల్లలకు రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు.

(డెస్క్)

**రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు**

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు తుంగతుర్తి లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఈ ఉదయం అధికార లాంఛనాలతో నిర్వహించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్ రెడ్డి ఈనెల 1వ తేదీన హైదరాబాద్ లో తుదిశ్వాస విడిచారు ఆయన భౌతిక కాయాన్ని సూర్యాపేట కు తీసుకువచ్చి నిన్న సాయంత్రం ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ ఉదయం అంత్యక్రియలు అధికార లాంఛనాలతో పూర్తిచేశారు.. ఈ కార్యక్రమంలో

మంత్రి ఉత్త   మ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రి సీతక్క , ఎమ్మెల్యేలు బాలూ నాయక్, మందుల సామేలు దామోదర్ రెడ్డి భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు.

(పీటీసీ నల్లగొండ జిల్లా)

**నాగర్ కర్నూల్ జిల్లా- ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్**

నాగర్ కర్నూల్ జిల్లాలోని ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో సఫారీ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాజాగా సఫారీ సేవలను తిరిగి ప్రారంభించడంతో పర్యాటకులు ఆన్ లైన్ లో బుకింగ్ చేసుకోవాలని అమ్రాబాద్ ఫారెస్ట్ అటవీ శాఖ అధికారి ఈశ్వర్ ఆకాశవాణితో చెప్పారు.

(సౌండ్ బైట్ ఈశ్వర్)

(పీటీసీ, నాగర్ కర్నూల్)

**వరంగల్ ఎన్నికలు కంట్రోల్ రూమ్**

వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా , నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ , ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారదతెలిపారు.ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించినా , డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి ఫిర్యాదులు ఉన్నా ప్రజలు సంప్రదించవచ్చని ఆమె కోరారు. ఉచిత నంబర్ 1800 425 3424 తో పాటు 91542 52936, 0870 2530812 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికలు విజయవంతం అయ్యేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

(పీటీసీ వరంగల్)

**సిరిసిల్ల-జంతు సంరక్షణ దినోత్సవం**

భూమిపైన మనుషులతో పాటు జంతువులకు కూడా ప్రత్యేక హక్కులు ఉన్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ చెప్పారు. జంతువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణితో మాట్లాడుతూ డాక్టర్ శ్రీధర్ చెప్పారు.

(సౌండ్ బైట్ డాక్టర్ శ్రీధర్)

(పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంద ని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది . అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

(డెస్క్)

**సాగర్ నీటి మట్టం**

కృష్ణానదిలో వరద ఉధృతి కారణంగా నాగార్జునసాగర్ జలాశయానికి ప్రవాహం కొనసాగడంతో అధికారులు 26 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి 2 లక్షల 70 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. అంతే మొత్తంలో నీరు విడుదల చేస్తున్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం 2 వేల 4 వందల క్యూసెక్కులు సాగర్ వరద కాలువ ద్వారా.. మరో 300 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు.

పిటిసి, నల్గొండ

**పరకాల అభివృద్ధికి నిధులు**

హన్మకొండ జిల్లాలోని పరకాల పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 15 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. దీనికి సంబంధించిన పాలనా అనుమతులు కూడా లభించడంతో, ఈ నెలాఖరులోపు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఇన్చార్జి కమిషనర్ కే. సుష్మ వెల్లడించారు.

(వరంగల్ జిల్లా పీటీసి)

**సిరిసిల్ల-వైద్యాధికారి**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత వైద్య సిబ్బందికి సూచించారు. బోయినపల్లి మండలం కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**భద్రకాళి-నవరాత్రి వేడుకలు**

వరంగల్ లోని చారిత్రక భద్రకాళి దేవాలయంలో నిన్న రాత్రి భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం బయట ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ వేదికపై ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు భద్రకాళి భద్రేశ్వరులను దర్శించుకున్నారు.

(వరంగల్ జిల్లా పీటీసి)